క్లుప్తంగా

వెంకయ్యస్వామికి విశేషపూజలు



మనుబోలు: స్థానిక బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి మందిరంలో శనివారం పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. వెంకయ్యస్వామి విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

దుర్గంధం వెదజల్లుతున్న చెరువు సప్లై చానల్



పొదలకూరు : పట్టణ నడిబొడ్డున ఉన్న చెరువు సప్లై చానల్ దుర్గంధం వెదజల్లుతోంది. మెయిన్‌రోడ్డు పక్కనే ఉన్న ఈ కాలువలోకి డ్రైనేజీని వదిలేయడంతో పాటు వ్యాపారులు చెత్తను పడేస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ కాలువలో మంచినీటి పైపులైన్‌ను ఏర్పాటు చేసి ఉన్నారు. పైపులు లీకైతే తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ఇరిగేషన్ అధికారులు స్పందించి మురుగును వదలకుండా, చెత్తను పడేయకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

శ్రీహరిస్వామికి సత్కారం



నెల్లూరు(బృందావనం): నగరానికి చెందిన అర్చకుడు, జ్యోతిష్య పండితుడు తెనాలి శ్రీహరిస్వామిని పురమందిరంలో శనివారం సత్కరించి స్ఫూర్తి అవార్డును ప్రదానం చేశారు. తమిళనాడులోని హొసూరులో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్‌ను ఆయన అందుకున్నారు. ఈ క్రమంలో పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సత్కరించారు. న్యూ సమైఖ్య మ్యారేజ్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గున్నం శ్రీనివాస్, జంగమ సేవా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గంధవళ్ల దశరథరామయ్య, పంచాక్షరి మల్లయ్య, చలపతి స్వామి, శర్మ, పురమందిర మేనేజర్ హరిప్రసాద్‌రెడ్డి, కోటేష్, సురేష్, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు, అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆడికృత్తిక

నెల్లూరు(బృందావనం): ఆడికృత్తికను పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో బాలసుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు, పూజలను శనివారం నిర్వహించారు. అనంతరం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి నెమలి హంససేవ, పేట ఉత్సవాన్ని జరిపారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

విశ్వకర్మ జయంతిని నిర్వహించాలని వినతి

నెల్లూరు(అర్బన్): విశ్వకర్మ భగవాన్ జయంతి కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణులను ఆహ్వానించి ఒక వేదిక ద్వారా ప్రభుత్వమే నిర్వహించాలని విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు ఖాజన వెంకటశేషయ్య కోరారు. ఈ మేరకు కలెక్టరేట్లో జేసీ కార్తీక్, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవికి వినతిపత్రాలను వేర్వేరుగా శనివారం అందజేశారు. సంఘ గౌరవాధ్యక్షుడు సదాశివ ఆచారి, నేతలు చంద్ర, నాగార్జున, వరప్రసాద్, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

22న చలో కలెక్టరేట్

నెల్లూరు (టౌన్): విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చలో కలెక్టరేట్‌ను ఈ నెల 22న నిర్వహించనున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెన్ను నరేంద్ర పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బాలాజీనగర్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి 14 నెలలు పూర్తయినా, విద్యార్థులకు ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చలేదని ఆరోపించారు. జీఓ నంబర్ 77ను రద్దు చేయడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన రూ.6400 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విక్రమ్, నేతలు ప్రవీణ్, యజ్ఞేష్, సంతోష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు.. సమస్యల నిలయాలు

- శిథిలావస్థకు చేరిన భవనాలు
- బిక్కుబిక్కుమంటూ ఉద్యోగుల విధుల నిర్వహణ
- ప్రజలకూ తప్పని పాట్లు



శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయం

కొడవలూరు: ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వ కార్యాలయాలే సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. ప్రధాన కార్యాలయాలు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. అధికారులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఒకట్రెండు కార్యాలయ భవనాలు అసౌకర్యాల నడుమ మగ్గుతున్నాయి. ఈ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు.

ప్రధాన కార్యాలయాల పరిస్థితి ఇలా..

- మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పాత ఇరిగేషన్ అతిథి గృహ భవనంలోకి మార్చారు. ఈ భవనం పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. శిథిలమై పాములకు ఆవాసంగా మారిన భవనానికి పైపైన రంగులు వేసి తహసీల్దార్ కార్యాలయంగా మార్చారు. బ్రిటీష్ కాలంలో నిర్మించినది కావడంతో ఎప్పుడు కూలుతుందోనన్న భయంతో ఉద్యోగులు బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వహిస్తున్నారు.
- మరో ప్రధాన కార్యాలయమైన ఎంపీడీఓ కార్యాలయం కూడా శిథిలావస్థకు చేరింది. ఈ భవనానికి ఇప్పటికే రెండు పర్యాయాలు మరమ్మతులు చేపట్టారు. అయినప్పటికీ చినుకు పడితే కార్యాలయం ఉరుస్తూ కాలు మోపలేని పరిస్థితి నెలకొంటోంది. ఎంపీడీఓ ఉంటున్న గదిలోనే పెచ్చులూడి పడుతుండడంతో కుర్చీ ఎక్కడికి మార్చుకోవాలో అర్థంకాక ఎంపీడీఓ అయోమయంలో ఉన్నారు.

శ్మశానంలో పశువైద్యశాల

కొడవలూరులోని పశువైద్యశాలను శ్మశానంలో నిర్మించారు. దీనికితోడు భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో మందులు సైతం తడిసిపోతుండడంతో కాపాడడం కష్టంగా మారింది. శ్మశానంలో ఆస్పత్రి ఉండడంతో ఇక్కడ అంత్యక్రియలు, కర్మకాండలు జరిగితే మూసివేయాల్సి వస్తోంది. ఆస్పత్రికి చుట్టూ పిచ్చి మొక్కలు, కంప్ర తుమ్మ చెట్లు దట్టంగా పెరిగి ఉండడంతో విష సర్పాలు లోనికి వస్తున్నాయి. దీంతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నామని సిబ్బంది బాహాటంగా చెబుతున్నారు.

వ్యవసాయ కార్యాలయానికి గ్రహణం

మండల వ్యవసాయ శాఖ కార్యాలయానికి గ్రహణం పట్టింది. 1994 ప్రాంతంలో పీహెచ్‌సీ పక్కనే వ్యవసాయ కార్యాలయ భవనాన్ని సగం నిర్మించి బిల్లులు చెల్లించలేదన్న నెపంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. అది అలాగే ఉండిపోగా 2018లో టీడీపీ ప్రభుత్వం ఎంపీడీఓ కార్యాలయానికి పక్కనే కొత్త భవనం నిర్మించింది. ఈ భవనం పూర్తయినప్పటికీ నిధులు చాలలేదన్న కారణంగా మరుగుదొడ్లు, నీళ్ల ట్యాంక్, విద్యుత్ సరఫరా, ఫ్లోరింగ్ వంటి పనులు పూర్తి కాలేదు. అందుకు ఇంకొంత నిధులు కేటాయిస్తామని ప్రభుత్వ పెద్దలు చెప్పినప్పటికీ అమలుకు నోచుకోక ఆ భవనం కూడా అలాగే ఉండిపోయింది. ఇటీవల సమస్యను స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకుపోగా ఆమె మిగిలిన పనులు పూర్తిచేసి కార్యాలయాన్ని వినియోగంలోకి తేవాలని రూ.5 లక్షలు మంజూరు చేశారు. అయితే మూడు నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ కార్యాలయం ఎంపీడీఓ కార్యాలయంలోని ఓ గదిలో అసౌకర్యాల నడుమ నడుస్తోంది.

గుంతలో సమాఖ్య కార్యాలయం

నిత్యం మహిళలతో రద్దీగా ఉండే సంఘ మిత్ర మండల సమాఖ్య కార్యాలయాన్ని మెయిన్ రోడ్డు పక్కన నాలుగు అడుగుల పల్లంలో నిర్మించారు. దీంతో వర్షం పడితే నెల రోజులపాటు కార్యాలయంలోకి వెళ్లలేకపోతున్నారు. కార్యాలయం ముందు భాగంలో మట్టి తోలి ఎత్తు పెంచితే సమస్య పరిష్కారమవుతుంది. కానీ ఆ దిశగా ఎవ్వరూ యత్నించడం లేదు.




తహసీల్దార్ కార్యాలయం నిర్వహిస్తున్న శిథిల ఇరిగేషన్ అతిథిగృహం



అసంపూర్తిగా వదిలేసిన వ్యవసాయ శాఖ కార్యాలయం

సౌకర్యవంతంగా ఉండాలి



ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు వస్తుంటారు. అందువల్ల వీటిని సౌకర్యవంతంగా ఉండేలా చూడాలి. అధికారులు, సిబ్బందే బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వహిస్తుంటే ప్రజల సమస్యలపై ఏ మేర దృష్టి సారిస్తారన్నది సందేహమే. ప్రజాప్రతినిధులు స్పందించి కార్యాలయాలపై ప్రత్యేక దృష్టిసారించి సౌకర్యవంతంగా ఉండేలా చూడాలి.

– కొడవలూరు మోహన్‌రావు, విశ్రాంత వీఆర్వో, నార్తురాజుపాళెం

సమస్యలను పట్టించుకోవడం లేదు



వ్యవసాయశాఖ, సంఘ మిత్ర కార్యాలయాలు ఎంతో ప్రాముఖ్యత కలిగినవి. ఈ కార్యాలయాల సమస్యలను తక్కువ ఖర్చుతోనే పరిష్కరించవచ్చు. కానీ ఎందుకో జాప్యం చేస్తూ వస్తున్నారు. వ్యవసాయశాఖ కార్యాలయాన్ని నిర్మించి తుది మెరుగులద్దకుండా వదిలేశారు. సంఘ మిత్ర కార్యాలయం ముందు మట్టితోలితే సమస్య పరిష్కారమవుతుంది. ఇందుకు బాగా తక్కువ ఖర్చవుతుంది. అయినప్పటికీ ఎవ్వరూ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

– పెనాక నాగ శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచ్, పెయ్యలపాళెం, కొడవలూరు మండలం



ఉరుస్తున్న ఎంపీడీఓ కార్యాలయం

బలవంతపు భూసేకరణ తగదు



చలో కరేడు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

తోటపల్లిగూడూరు: ఉలవపాడు మండలం కరేడులో ఇండోసోల్ కంపెనీకి కోసం బలవంతంగా భూసేకరణ చేయడం తగదని సీపీఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య అన్నారు. కరేడులో బలవంతపు భూసేకరణను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 18న చేపట్టనున్న చలో కరేడు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను నరుకూరు సెంటర్‌లో సీపీఎం నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ఎవ్వరూ వ్యతిరేకం కాదన్నారు. పరిశ్రమల స్థాపన విషయంలో ప్రజాభిప్రాయానికి అనుగుణంగా పాలకులు వ్యవహరించాలన్నారు. కరేడులో ఇండోసోల్ ప్రాజెక్ట్ నిర్మాణానికి పచ్చని పంటలు పండే భూములను ఇవ్వబోమని చెబుతున్న రైతులను ప్రభుత్వం ఇబ్బంది పెట్టడం సమంజసం కాదన్నారు. న్యాయబద్ధంగా పోరాటం సాగిస్తున్న కరేడు రైతులకు సీపీఎం అండగా నిలుస్తుందన్నారు. ఈ నెల 18న చేపడుతున్న చలో కరేడు కార్యక్రమానికి సీపీఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మండల కమిటీ సభ్యులు మారుబోయిన రాజా, మోచర్ల రాధయ్య, నాయకులు శివ, సుబ్బయ్య, యాసిన్, సునీల్, నారాయణ, భార్గవ్, గిరి, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదానికి పిలుపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం (కోవూరు) : డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ ఈ నెల 25న విజయవాడలో చేపడుతున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఆ యూనియన్ నాయకులు కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బుచ్చిరెడ్డిపాళెంలోని విద్యాశాఖ కార్యాలయం వద్ద శనివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు భీమతాటి రమణయ్య, ఎస్‌కే ఉస్మాన్ మాట్లాడుతూ 2003లో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినా పోస్టింగులు ఇవ్వడంలో జాప్యం జరిగిందన్నారు. ఫలితంగా తమను కొత్త పెన్షన్ విధానంలోకి బలవంతంగా చేర్చారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ జీఓ నంబర్ 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ఈ నెల 25న విజయవాడలో చేపడుతున్న మహాధర్నాలో డీఎస్సీ–2003 ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఉపాధ్యాయులు భీమరాజు,రాణి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా వదిలేశారు



గోడలు కూలిన రేకులషెడ్డు



పిచ్చిమొక్కలతో నిండిన క్వార్టర్

పొదలకూరు: మండలంలోని పులికల్లు సమీపంలో ఉన్న తెలుగుగంగ క్వార్టర్లను నిరుపయోగంగా వదిలేయడంతో శిథిలావస్థకు చేరాయి. 1986లో కండలేరు మట్టికట్ట నిర్మాణ సమయంలో పులికల్లును తెలుగుగంగ సబ్‌డివిజన్‌గా ఏర్పాటు చేసి డీఈ కార్యాలయం, క్వార్టర్లను నిర్మించారు. జనాలతో సందడిగా ఉండే డీఈ కార్యాలయం మూడు దశాబ్దాలకుపైగా కళావిహీనంగా మారింది. ఇక్కడ సబ్‌డివిజన్ కార్యాలయాన్ని ఎత్తివేయడంతో క్వార్టర్స్‌లో ఉన్న వారు ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఫలితంగా దొంగలు అందిన కాడికి ఇనుము, రేకులు, ఇతర సామగ్రిని దొంగిలించుకుని వెళ్లారు. ప్రస్తుతం అటుగా ఎవరూ వెళ్లడం లేదు. అయితే కొన్ని క్వార్టర్లు ఓ మోస్తరుగా ఉండడం వల్ల ప్రత్యామ్నాయంగా వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందనే అభిప్రాయాన్ని గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు.

రైతులు ఉపయోగించుకోవచ్చు

నిరుపయోగంగా ఉన్న తెలుగుగంగ క్వార్టర్లను చుట్టుపక్కల గ్రామాల రైతులు గోదాములుగా ఉపయోగించుకునేందుకు అవకాశం ఉందని వెల్లడిస్తున్నారు. చిన్నపాటి మరమ్మతులు చేయించుకుంటే వాడుకునేందుకు ఉపయోగంలోకి వచ్చే అవకాశం ఉంది. ఫలితంగా పంటలను నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. సంబంధిత శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

వెంకటాచలం: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వృద్ధుడు(75)శుక్రవారం మృతి చెందారని వెంకటాచలం పోలీసులు శనివారం తెలిపారు. చెముడుగుంట సమీపంలోని డెక్కన్ క్రానికల్ కార్యాలయం వద్ద ఈ నెల 10న గుర్తుతెలియని వృద్ధుడు స్పృహ కోల్పోయి పడిపోగా 108 వాహన సిబ్బంది నెల్లూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం పరిస్థితి విషమించడంతో వృద్ధుడు మృతి చెందారని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా పల్లకిసేవ



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని లక్ష్మీగోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం దేవదేవేరులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిసేవను వైభవంగా నిర్వహించారు. స్వామివారు విశేషాలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

వీఎస్‌యూ విద్యార్థినికి డాక్టరేట్



వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీయస్‌యూ) మెరైన్ విభాగం పరిశోధన విద్యార్థిని కే మౌనికకు డాక్టరేట్ లభించింది. ఆమె ప్రొఫెసర్ హనుమారెడ్డి పర్యవేక్షణలో 'మానిటరింగ్ ఆఫ్ హెవీ మెటల్స్ కాంటామినేషన్ ఇన్ కమర్షియల్లీ ఇంపార్టెంట్ ఆన్ ఫిష్ అండ్ ప్రాన్సెస్ కలెక్టెడ్ ఫ్రమ్ నెల్లూరు కోస్ట్' అనే అంశంపై పరిశోధనలు సాగించి పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. ఇందుకు గానూ వీఎస్‌యూ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా మౌనికను వీసీ అల్లం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కే సునీత, తదితరులు అభినందించారు.

పేద విద్యార్థులకు చేయూత



తాత వెంకురెడ్డికి చెక్కు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మనుబోలు: మండలంలోని మడమనూరు గ్రామానికి చెందిన పేద రైతు బిరదవోలు కృష్ణారెడ్డి రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. కుటుంబ యజమాని చనిపోవడంతో పిల్లలకు చదువు ఆర్థిక భారంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న సేవానాథం ట్రస్ట్ ఫౌండర్ మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి స్పందించి పేద పిల్లల చదువు కోసం గతేడాది రూ.'20 వేలు, ప్రస్తుతం రూ.25 వేలు నగదు అందజేశారు. శనివారం పిల్లల తాత వెంకురెడ్డికి రూ.25 వేల చెక్కును ట్రస్ట్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మహీధర్‌రెడ్డి, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

తోటపల్లిగూడూరు: స్థానిక దళితకాలనీ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు జనసేన నాయకులు విద్యాసామగ్రిని శనివారం పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం ప్రశాంతి విజ్ఞప్తి మేరకు పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు, తదితరాలను అందజేశారు. జనసేన మండల ప్రధాన కార్యదర్శి పవన్, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

పొదలకూరు: స్థానిక గీతామందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు మేలుకొలుపు, 7.30 గంటలకు గీతాపారాయణం, 8 గంటలకు పల్లకి సేవ, 10 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, 11.20 గంటలకు శ్రీకృష్ణుడికి బంగారుపూలతో అష్టోత్తరం, మధ్యాహ్నం 12 గంటలకు మంత్రపుష్పం, 12.15 గంటలకు హారతి, తీర్థప్రసాద వినియోగం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ నిర్వహించారు. అలాగే లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

వెంకటాచలం: స్థానిక రాధేకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణుల మూలవిరాట్టులకు విశేషాలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు భక్తులతో అభిషేకాలు చేయించారు. సాయి దర్బార్ అద్దాల మందిరం వారితో కోలాట ప్రదర్శన నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలతో అలరించారు . కోనేరు శ్రీకాంత్, లలిత దంపతులు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మనోజ్‌గుప్తా, వరదగల్లు హరిబాబు, మందిపాటి రమేష్‌బాబు, గజ్జల శంకరమ్మ, పుత్తూరు వెంకటరత్నం, చల్లా రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: మండలంలో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. రావూరు, పున్నూరు, మైపాడు, తదితర గ్రామాల్లోని కృష్ణమందిరాల్లో ఉదయం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. రాత్రి పల్లకిసేవ, గ్రామోత్సం నిర్వహించారు.

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని పుట్టవీధితోటలో త్రైత సిద్ధాంత భగవద్గీత సేవా సమితి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భగవద్గీత పారాయణం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

మనుబోలు: మండలంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణ మందిరాలు, రామాలయాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. గ్రామాల్లోని వివిధ కూడళ్లలో చిన్నారులు ఉత్సాహంగా ఉట్టికొట్టి సంబరాలు చేసుకున్నారు.



పొదలకూరులోని గీతామందిరంలో విశేషాలంకారంలో శ్రీకృష్ణుడు



బుచ్చిరెడ్డిపాళెంలో..



పొదలకూరులో భక్తులకు అన్నదానం



వెంకటాచలం: రాధాకృష్ణులకు అభిషేకాలు చేస్తున్న భక్తులు



మనుబోలులో ఉట్టికొడుతున్న చిన్నారులు